'స్వాతంత్ర్యం దేశానికి వచ్చినట్లుగానే నాకూ వస్తే !! ఛ...ఛ... రావడ మేమిటి? నేనే సాధించుకోగలిగితే?! ఈ ఇంట్లో తనదంటూ ఒక స్థాన మేర్పరచుకోగలిగితే ఎంత బాగుండును?' ఆలోచిస్తూ కూర్చున్న వసుంధరను చూసి, "వదినా! కూర మాడుతున్నట్లుంది"అని హెచ్చరించి వెళ్ళింది శశికళ.

ఉలిక్కిపడి గబగబ గ్లాసెడు నీళ్ళు కూరలో వేసింది వసుంధర. మాడిపోయిన వాసన గుప్పుమన్నది. 'తన బ్రతుకు కూడా మాడిపోయిన కూరలాంటిదే' అనుకుంటూ విరక్తిగా నవ్వుకుంది వసుంధర. తల్లి తండ్రులు గారాబంగా పెంచి, పెళ్ళి చేసి, తమ బాధ్యత తీరిపోయిందని హాయిగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. అత్తింట్లో తన కష్టాలు చెప్పుకొని, కన్నవాళ్ళ ఆనందానికి ఆనకట్ట వేయలేక లోలోనే మథనపడసాగింది వసుంధర. పెళ్ళికాకముందు విషయం ఏమోగాని, పెళ్ళయిన తర్వాత ఆ ఇంటిలో ప్రతి ఒక్కరి పని కొత్త పెళ్ళి కూతురు వసుంధరే చేయాల్సి వచ్చేది. క్రమంగా వసుంధర ఒక యంత్రంలా గడపడం నేర్చుకున్నది. కనీసం భర్త రామనాథం కూడా ఆమె ఆ ఇంటిలో ఏ విధంగా జీవిస్తూందో పట్టించుకోడు.

"వసూ! బకెట్‌లో నా బట్టలు వేశాను. సాయంత్రానికల్లా ఉతికి ఆరవేయి" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు రామనాథం.

"వదినా! నాకు త్వరగా టిఫిన్ పెట్టు" అంటూ కూర్చున్నాడు చిన్న మరిది మురళి. మురళికి ప్లేట్‌లో ఉప్మా పెట్టి, వరండాలోకి వచ్చి నిలబడింది వసుంధర. పక్క వీథిలోనుంచి స్వాతంత్ర్యానికి సంబంధించిన పాటలు వస్తున్నాయి. తనకు చిన్నప్పట్నించీ స్వాతంత్ర్య దినోత్సవమన్నా, ఆ పాటలన్నా ఎంతో ఇష్టం. ఆ రోజుల్లో తన ఉత్సాహ మంతా ఇంతా కాదు. కాని ఇప్పుడో ?!

పంజరంలో బంధించిన రామచిలకలా ఉంది తన పరిస్థితి. "వదిన అమ్మేదీ?" అంటూ వచ్చాడు పెద్ద మరిది శంకరం.

# నాకూ స్వాతంత్ర్యం కావాలి!

## -షాజాద్ బేగం

"గన్నవరంలో ఉన్న మా పెద్దమ్మ దగ్గరకు వెళ్ళారు" అని చెప్పి వంటింట్లోకి వెళ్ళింది వసుంధర. తన బ్రతు కింతే ఇక. అత్తగారు పెత్తనాలకు వెళ్ళిపోతారు. ఇక ఆడపడుచులూ, మరదులూ ఒక చిన్న పనయినా చేసి పెట్టరు. ఒక ఆడపడుచు ఎప్పుడూ మిషన్ కుట్టుపైనే కాలం గడుపుతూ ఉంటుంది. శశికళ చదువుకుంటూంది. శంకరం, మురళి అయితే దమ్మిడీ ఆదాయం సంపాదించరు కాని, పనికిమాలిన మిత్రబృందంతో కాలక్షేపం చేస్తూ ఉంటారు.

అత్తగారు మటుకు ఏ ఒక్కరినీ మందలించదు సరికదా, ఇంటి పనులలో ఆవగింజంత చేయూతనయినా ఇవ్వదు. పైగా కోడలిమీద విసుక్కుంటూ ఉంటుంది. అందరూ ఉప్మా తిని వెళ్ళిపోగానే, తనూ తినడానికి కూర్చుంది వసుంధర.

"వదినా! నేను సుభద్ర వాళ్ళింటికి వెళ్తున్నా"నంటూ వెళ్ళిపోయింది పెద్ద ఆడపడుచు రమణి. అన్యమనస్కంగా తిని, బకెట్ తీసుకొని బావిదగ్గరకు వెళ్ళింది వసుంధర. పక్కింటి విశాల కూడా వచ్చింది.

"ఏమిటండోయ్! ఈ రోజు అదోలా ఉన్నారు. ఒంట్లో బాగాలేదా ? ఇంట్లో శంకరం, మురళీ లేరా? వాళ్ళు తోడిపెట్టరా నీళ్ళు ? మీ రెందుకు వచ్చారు?" అంటూ పరామర్శించేసరికి వసుంధర కళ్ళలో నీరు గిర్రున తిరిగింది. "ఇంట్లో ఎవ్వరూ లేరు, విశాలా!" జవాబు చెప్పింది.

"మీ రెన్నయినా చెప్పండి, అక్కయ్యగారూ. మీ ఇంట్లో మీరు చేసే చాకిరీ చూస్తుంటే నా కేమనిపిస్తుందో తెలుసా? నేనే గనక మీ స్థానంలో ఉంటే ఒక్కొక్కరి రోగం కుదిర్చి, దర్జాగా ఉండేదాన్ని."

"నా కిప్పుడేమయింది, విశాలా! నీదంతా వెర్రిగానీ. అయినా ఇక్కడ నా సుఖానికి వచ్చిన కొరత ఏమిటి?" తనను తాను అనునయించుకుంటూ జవాబిచ్చి, బట్టలు ఆరేయడానికి వెళ్ళింది వసుంధర.

'తన బాధలు తనే భరిస్తానంటూంది గాని, ఇతరులకు తెలియకుండా ఎంత జాగ్రత్తగా మసలు కుంటూం దీ వసుంధర! ఇలాంటి దేవత ఆ రాక్షసుల మధ్య ఎలా నలిగిపోతూందో?' సానుభూతితో ఒకసారి వసుంధరవైపు చూసి నిట్టూర్చింది విశాల.

• • •

పడుకుందన్న మాటేగాని, వసుంధర కసలు నిద్ర పట్టనేలేదు. తాను చిన్నప్పుడు జరుపుకున్న స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలే పదే పదే గుర్తుకు వస్తున్నాయి. గతం తాలూకు ఆ జ్ఞాపకాలు మధుర స్మృతులై వసుంధర కళ్ళముందు కదిలాయి. ఎక్కడ చూసినా జండాలు విను వీథుల్లో స్వేచ్ఛగా ఎగురుతున్నాయి. ప్రతి ఒక్కరి ముఖంలోనూ ఆనందోత్సవాలు తాండవిస్తున్నాయి. ఇంటర్ చదువుతున్న వసుంధర కాలేజీ కెళ్ళింది. కాలేజీలో ఫ్లాగ్ హాయిస్టింగ్ తర్వాత కార్యక్రమాల చివరగా బహుమతు లందించారు. తన రచన స్వాతంత్ర్య పోరాటానికి ఫస్ట్ ప్రయిజు వచ్చింది. కరతాళ ధ్వనుల మధ్య గాంధిజీ బొమ్మను బహుమతిగా అందుకున్న వసుంధర హృదయం మయూరంలా నాట్యం చేసింది. ఆ రోజంతా చాలా ఆనందంగా గడచిపోయింది. ఆ సంవత్సరంలోనే వసుంధర పెళ్ళి రామనాథంతో జరిగిపోయింది. నాలుగు సంవత్సరాలు గడచిపోయాయి. యాంత్రికంగా ఆ ఇంటి పనుల బాధ్యత వహించి, సుఖమంటే ఏమిటో మరచిపోయిన వసుంధరకు చిన్నారి బాబు పుట్టుకతో జీవించాలనే ఆశ చిగిర్చింది. విశాలతో స్నేహం తన జీవితానికి కొంత పూరట కల్గించిందనే చెప్పాలి. ఆనాటి జీవితంలోని వెలుగు ఈనాడు స్మృతిఅయి నిలిచిఉంది. ఆ జ్ఞాపకాలలోనే వోలలాడుతూ హాయిగా ఆదమరచి నిద్రపోయింది వసుంధర.

• • •

టిఫిన్ చేసి, రామనాథం కాలేజీకి వెళ్ళిపోయాడు. వూరినుండి వచ్చిన వర్ధనమ్మ తన కూతుళ్ళనూ, కొడుకులనూ కూర్చోబెట్టుకుని అక్కడి కబుర్లు గొప్పగా చెప్పడం మొదలుపెట్టింది. బియ్యం ఏరుతూ కూర్చున్న వసుంధర కా మాటలన్నీ పమ్మెట పోటుల్లా బాధిస్తున్నాయి.

"అక్క కోడలు ఎంత బాగుందో—తెల్లగా, అందంగా ఉంది. నా కోడలూ ఉంది—ఎందుకూ? ఏమయినా రంగా పాడా ? అక్క కొడుకు రామం ఎంత అదృష్టం చేసుకున్నాడో—అందగత్తె భార్యగా లభించింది. వాళ్ళు కట్నాలు, లాంఛనాలు పెద్ద మొత్తంలోనే ఇచ్చారట. దేనికయినా అదృష్టమంటూ ఒకటి ఉండాలి. ఎవరినని ఏం లాభం? నా తలరాత ఇలా ఉంది" అంటూ ఏవేవో చెప్పసాగింది వర్ధనమ్మ.

"ఇదిగో, వసుంధరా! ఆ బియ్యం అలా పెట్టి, బావి దగ్గర్నుంచి నీళ్ళు పట్రా, నేను స్నానం చేయాలి." అత్తగారి ఆజ్ఞను పాటించడానికి లేచిన వసుంధర నిద్రనుంచి లేచి ఏడుస్తున్న బాబును ఎత్తుకొని వూరడించింది. అంతే...

వర్ధనమ్మ కోడలివైపు కొరకొరా చూసి, "పిల్లాడేడిస్తే ఏమీ చిక్కిపోడులే. నాకు తొందరగా నీళ్ళు పట్రా" అంటూంటే అప్పటివరకూ కబుర్లు వింటున్న వాళ్ళు ఎవరి పుస్తకాలు తీసుకొని వాళ్ళు చదువుకోవడం మొదలుపెట్టారు. ఇక చేసేదిలేక బావివైపు కదిలింది వసుంధర.

• * * *

తెల్లారుతూ ఉండగానే చుట్టుపక్కల నుండి స్వాతంత్ర్య దినోత్సవ పాటలు మైక్‌లనుండి శ్రావ్యంగా వినిపించసాగాయి. అప్పుడే లేచిన వసుంధర హడావిడిగా వంటగదిలోకి వెళ్ళి పొయ్యి రాజేసింది. నీళ్ళు కాగబెట్టడానికి బొగ్గుల కుంపటి వెలిగించింది. చకచకా టిఫిన్ తయారు చేసింది. అందరూ ఒక్కొక్కరే స్నానాలు ముగించి, అందంగా ముస్తాబవుతున్నారు. అవును మరి... ఆ రోజే స్వాతంత్ర్య దినోత్సవం. శశికళ, మురళి, శంకరం, రామనాథం— అందరూ టిఫిన్ చేసి హడావిడిగా వెళ్ళిపోయారు. ఆ రోజు అందరూ కలిసి సాయంత్రం గాంధీ హిల్‌కు వెళ్దామని రామనాథం చెప్పేసి వెళ్ళిపోయాడు.

పెద్దాడపడుచు బట్టలు మిషన్‌మీద కుడుతూ పాటలు పాడుకుంటూ ఉంది. వంట ముగించి, బాబుకోసం చుట్టూ చూసింది. 'ఇంక రెండేళ్ళలో తన చిన్నారి కూడా చక్కగా ముస్తాబై బడికెళ్తాడు.' ఆ ఆలోచన వసుంధర మనస్సు కెంతో హాయిని కల్గించింది. బాబుకోసం కలియజూచిన వసుంధరకు మట్టిలో దొర్లాడుతున్న బాబు కన్పించాడు.

వర్ధనమ్మ ఇదేమీ పట్టించుకోకుండా వసుంధరవైపు చూస్తూ, "వంటయిపోయిందా! నీళ్ళన్నీ ఖర్చయిపోయాయి. కాస్త నీళ్ళు తోడిపెట్టు—

స్నానం చేయాలి. అబ్బాయి వచ్చి సాయంత్రం గాంధి హిల్‌కు తీసుకెళ్తాడట. నువ్వొకసారి చూశావుగా'' అన్నది.

ఒకసారి బాబువైపు, మరోసారి అత్తగారివైపు చూస్తూ, ముందు ఏ పని చేయాలో తెలియక నిలబడిపోయిన వసుంధరను వరండాలో నించుని చూస్తూ జాలిగా నవ్వింది విశాల.

వసుంధర దగ్గరగా వెళ్ళి బాబు నెత్తుకొని— ''అక్కగారూ! మీరూ స్నానం చేసేయండి. బాబును నేను చూసుకుంటా'' నంటూ తన వాటాలోకి వెళ్ళింది విశాల. ఏడుపు ముంచుకొచ్చింది వసుంధరకు. 'ఈ రోజుకని తానెన్ని కలలు కన్నదీ?! ఆ కలలన్నీ కన్నీటిలో తుడుచుకెళ్ళాయి. తన బాబునైనా ఈరోజు చక్కగా ముస్తాబు చేయలేకపోయింది. అత్తగారు గాని, ఆడపడుచులు గాని వంట ఇంటి చాయలకు రారుగానీ, వండి వార్చిపెడితే వచ్చి వడ్డిస్తారు. అంతే....ప్రతి పనీ తనే చేయాలి.' ఆలోచిస్తూ నీళ్ళు తోడుతుంటే చేతిలోంచి బకెట్ చేంతాడుతో సహా జారి బావిలో పడిపోయింది. 'ఈరోజుకయినా తనకు స్వేచ్ఛలేదు. సుఖం లేదు' అనుకుంటూ గబగబా విశాల నడిగి ఆ బకెట్‌తో చేది, నీళ్ళు నింపింది. వర్ధనమ్మ స్నానాని కెళ్ళింది.

ఇంతలో బాబు నెత్తుకు వచ్చి, ''అక్కా!...బాబుకు స్నానం చేయించి, పౌడరు రాశాను. బట్టలిస్తే తొడిగిస్తా'' అన్నది విశాల. బాబు బట్టలు తీసి ఇచ్చింది వసుంధర. బాబును ఎత్తుకొని వెళ్ళింది విశాల.

* * *

మధ్యాహ్నం భోజనా లనంతరం ఇంట్లో అందరూ చక్కగా ముస్తాబవుతూ గాంధిహిల్‌కి వెళ్ళడానికి సన్నద్ధు లవుతున్నారు. రామనాథం మటుకు ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి అటునుంచి అటే గాంధిహిల్‌కు వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. కొడుకు బయటకు వెళ్ళిపోగానే వర్ధనమ్మ కోడలు దగ్గరకు వచ్చి— ''నాకు గాంధిహిల్ చూడాలని ఉంది. కాని, ఏం చేయాలో తోచడం లేదు. రేపు నేను పెద్దమ్మాయి ఇందిర వాళ్ళ వూరికి వెళ్ళాలి. బట్టలు చూస్తే ఉతకాలి. రేపు ఉదయాన్నే బండికెళ్ళాలి. నీవు మరెప్పుడయినా గాంధిహిల్ చూడొచ్చులే. కాస్త నా బట్టలు ఉతికేయ్. అబ్బాయితో చెబుతాలే—నీకు తలనొప్పిగా ఉండి రాలేదని. బాబును తీసుకెళ్తాం...నువ్వు కాస్త పని చేసేయ్. ఏమంటావు?'' మెల్లగా అడిగింది.

వసుంధరకు చాలా మొహమాటం. అత్తగారిని ఎదిరించలేక అలాగే అంటూ తల వూపి, ''బాబును తీసుకెళ్ళద్దు. నా దగ్గరే ఉంటాడులెండి'' అని చెప్పేసి, పకోడీలు చేయడానికి ఉల్లిపాయలు తరుగుతూ కూర్చుంది. సరిగ్గా అయిదున్నరకు అందరూ కాఫీలు సేవించి బయల్దేరారు.

అత్తగారు చెప్పినట్లుగానే బట్టలన్నీ ఉతికి ఆరవేసింది వసుంధర. తాను చేసిన హల్వా గిన్నెలో పెట్టి వసుంధర దగ్గరకు వచ్చిన విశాల బాబును నిద్రపుచ్చుతూ పాడుతున్న వసుంధరను చూసి ఆగిపోయింది.

''నా చిన్నారి కన్నా
నీకూ, నాకూ లేనిదీ
అందరికీ ఉన్నదీ
ఈ లోకాన ఒక్కటేనురా
అది నా కెన్నడూ లభించని
స్వేచ్ఛరా! నా చిన్నారి కన్నా!
చుక్కాని ఉన్నా గాలివాటుగా
సాగే నావరా నీ తల్లి బ్రతుకు
నా చిన్నారి కన్నా
నా కన్నుల పండువు
నీవేరా!''

విశాలను చూసి ఇక పాడలేకపోయింది వసుంధర.

''అక్కా! జాతీయ గీతం పాడుకొని ఆనందించాల్సిన ఈ రోజున బాబుకు నీ జాలిగాథ విన్పిస్తున్నావా? అక్కా! నువ్వు మారాలి. నీలో మార్పు వస్తేనే గాని నీ బ్రతుకు స్వేచ్ఛామయం కాదు. నీ బాబు బ్రతుకు నీ జీవితంతోనే ముడిపడి ఉంది. అది నీవు గుర్తించాలి. ఇదిగో, ఈ హల్వా తీసుకో. నీ కోసమనే తెచ్చాను. వస్తానక్కా'' అంటూ ఇచ్చి వెళ్ళిపోయింది విశాల.

వసుంధర ఆలోచనల్లో పడిపోయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఎందరో త్యాగమూర్తులీ స్వాతంత్ర్యంకోసం అసువులను కోల్పోయారు. ఈనాడు దేశ ప్రజలు స్వతంత్ర దేశంలో ఆనందంతో పండుగ చేసుకుంటున్నారు. ఈ ఉత్సవంలో అలంకరణలు చేసి, పతాకావిష్కరణకు జండా




కర్రను పాతి, పూలను సేకరించేవాళ్ళు, రంగు రంగుల జండాలు తోరణాలుగా ఎండలో శ్రమించి అందంగా కట్టే పనిమంతులు ఈ రోజున ఎంతమంది ఆనందించగలుగుతున్నారు? ఆ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎంతమంది పురుషులను సంసిద్ధులుగా చేస్తూ, తాము చీకటిలో అలమటిస్తూ తనలాంటి ఎంతమంది స్త్రీలు ఈ అమూల్య దినాన స్వేచ్ఛకోసం పరితపిస్తున్నారో కదా! *